## క్రైం కథ

"మంగళ నన్ను నిర్లక్ష్యం చేస్తోంది." అన్నాడు పరాత్పరరావు.

"ఎందుకు నువ్వంటే ఇష్టం లేదా?" అడిగాడు శివపాదం.

"అవును, ఇష్టం లేదనే చెప్పింది" ఇంకెప్పుడూ తనని కలుసుకునే ప్రయత్నం చెయ్యవద్దని వార్నింగ్ ఇచ్చింది."

"నరికేయాలి" కోపంగా అన్నాడు శివపాదం.

"అవును నాక్కూడా అలాగే అనిపించింది. కానీ ఓ ఆడదాన్ని హత్యచేసే ధైర్యం నాలో వున్నదా మిత్రమా?" కొంచెం దీనంగా అన్నాడు పరాత్పరరావు.

స్నేహితుడి మాటల్లో కదిలిన దీనత్వానికి శివపాదం చలించిపోయాడు.

# పన్నాగం

ప్రతాప రవిశంకర్



''డియర్ రావ్...స్నేహధర్మం అనేది ఒకటి వుంది. దాన్ని నేను పాటిస్తాను. నువ్వు చెయ్యలేని పనిని నేను చేస్తాను. నిన్ను తృణీకరించిన మంగళ గాలిలో కలిసిపోయేలా చేస్తాను. ఇదే నీకు నా స్నేహ కానుక.'' భరోసా ఇచ్చాడు శివపాదం నవ్వి...

అప్పుడు పరాత్పరరావు అదోలా నవ్వి ఇలా అన్నాడు.

''నీలాంటి స్నేహితుడు దొరికినందుకు నేను మరీ గర్వపడుతున్నాను. కానీ నా ఆలోచన వేరే విధంగా వున్నది. ఏమిటంటే...మనసుపడిన ఓ ఆడదాని మనసులో కొంచెం చోటు సంపాదించ లేని ఈ బతుకు ఎందుకు? అందుకే ఈ తనువును చాలిద్దామనుకుంటున్నాను.

శివపాదానికి మళ్లీ కోపం వచ్చింది.

''ఇడియట్‌లా మాట్లాడకు కామ్రేడ్. ఓ ఆడదాని మనసులో అడిగినంత చోటివ్వటానికి అన్ని అర్హతలు వున్న నిన్ను నిర్లక్ష్యం చేసినందుకు ఆ మంగళకు తగిన శిక్ష నేను విధిస్తాను. నీకు చాలా ప్యూచరుంది. ఈ మంగళను కాదనుకుంటే ఎంతో మంది అందగత్తెలు వున్నారు. ఇంకెవరినయినా ఎంచుకో.... అంతా మంగళలాంటివారే వుండరు. నీ మనసును గాయపరిచి నీ జీవితాన్ని అంతం చేసుకునే ఆలోచన వరకూ తీసుకెళ్లిన మనిషిని ఈ లోకం నుంచే పంపించివేస్తాను. ఇదే నా వాగ్దానం'' అన్నాడు శివపాదం.

ఇలా అన్న తరువాత ప్యాక్ లోంచి ఓ సిగరెట్టును తీసి ముట్టించాడు.

''ముందు కిటికీ తలుపులు తియ్యి. పొగ బయటకు వెళుతుంది'' అన్నాడు పరాత్పర రావు.

వాళ్లిద్దరూ వాళ్లు వుంటున్న గదిలో కుర్చీల్లో కూర్చున్నారు. వాళ్లు మంగళ గురించి మాట్లాడుకుంటున్నప్పుడే కరెంటు పోయింది.

సిగరెట్టు పొగను వదిలి ''నువ్వు ఏదయినా పథకం ఆలోచించు. మంగళ చీటి చింపుతాను.'' అన్నాడు శివపాదం.

''ఎప్పుడు?'' పరాత్పరరావు ఆత్రంగా అడిగాడు .

''ఒకటి రెండు రోజుల్లో''

''కొంచెం ఆలోచించుకోని'' అన్నాడు పరాత్పర రావు తనూ ఓ సిగరెట్టు వెలిగించి.

శివపాదానికీ, పరాత్పరరావుకి తొలిసారి 'శుభ సంకల్ప' బార్‌లో పరిచయమయ్యింది. వాళ్లిద్దరూ వేర్వేరు ప్రయివేట్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. తరచుగా బార్‌లో కలుసుకున్న వాళ్లు తర్వాత రూమ్మేట్లుగా మారిపోయారు. ఇలా జరిగిన తర్వాత పరాత్పరరావు మరో ప్రయివేట్ ఫర్మ్‌లో స్టెనోగా పని చేసే మంగళను ప్రేమించాడు. ఈ ప్రేమ కథ శివపాదానికి కూడా బాగా తెలుసు.

ఉన్నట్టుండి సందేహంగా అడిగాడు పరాత్పర రావు-

''హత్య చేసి పట్టుపడకుండా వుండగలవా?''

శివపాదం చిన్నగా నవ్వి-

''వెరీ సింపుల్...తగినంత జాగ్రత్త తీసుకొని చేస్తే పట్టుబడే అవకాశం వుండదు. సాధారణంగా హంతకుడు చేసే చిన్న పొరపాట్లు అతడిని పట్టిస్తాయి.. అలాంటి పొరపాట్లు జరక్కుండా చూసుకోవాలి.అంటే మన హత్యాపథకం పటిష్టంగా వుండాలి. అప్పుడు మనం సేఫ్‌గా వుంటాం'' అన్నాడు.

''గుడ్..అయితే విను. మగళ వుంటున్న ఇల్లు నీకు తెలుసు కదా. అవుట్‌హౌస్ లాంటి చిన్న ఇంట్లో వుంటోంది. ఏ రోజునయినా రాత్రి పన్నెండు గంటల సమయంలో వెళ్లు. తలుపు కొట్టు. ఎవరని అడుగుతుంది. నీ పేరు చెప్పు. ఎందుకని అడుగుతుంది. అప్పుడు పరాత్పరరావు ఆత్మహత్య చేసుకున్నాడనీ, అందుకు మంగళకారణమని ఓ ఉత్తరం రాసి సెట్టాడనీ ఆ విషయం గురించి చెప్పడానికి వచ్చాననీ చెప్పు. వెంటనే తలుపు తెరుస్తుంది. లోపలకు వెళ్లు. ఈ విషయం గురించి మాట్లాడుతూనే మంగళను పొడిచేయ్. అరుపులు బయటకు రాకుండా నోరు నొక్కు. కత్తి పిడి మీద, నోటి మీద వేలిముద్రలు తుడిచెయ్యి. కంగారు లేకుండా నీకు సంబంధించిన ఎటువంటి ఆధారం అక్కడ లేకుండా చూడు. పోలీసులు ఈ జన్మలో నిన్ను పట్టుకోలేరు.'' అని హత్యా పథకాన్ని వివరించాడు పరాత్పరరావు.

''అయితే ...రేపురాత్రికే మంగళ కథ ముగిస్తాను'' అన్నాడు శివపాదం.

***

''ఎవరూ?'' తలుపు తియ్యకుండానే అడిగింది మంగళ.

''శివపాదాన్ని''

''ఇంత రాత్రి వేళ నాతో ఏం పని?''

''పరాత్పరరావు ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకు నువ్వే కారణమని ఓ ఉత్తరం రాసిపెట్టి మరీ పోయాడు. ఆ విషయం గురించి నీతో మాట్లాడాలి'' చెప్పాడు శివపాదం.

తెరుచుకుంది తలుపు.

మంగళను నెట్టుకుంటూ లోపలకు వచ్చి శివపాదం తలుపు మూశాడు.

లోపల వెలుగుతున్న దీపం వెలుతురు మసగ్గా వుంది.

''పరాత్పరరావు నిజంగా ఆత్మహత్య చేసుకున్నాడా?'' ఆశ్చర్యంగా అడిగింది మంగళ.

''అవును. నువ్వు కాదన్నావని'' అంటూ చిన్నగా ప్యాంటు జేబులోంచి చెక్కపిడి వున్న కత్తిని బయటకు తీశాడు పిచ్చిగా శబ్దం లేకుండా నవ్వుతూ-

''ఏంటది?''భయంగా అడిగిందతి మంగళ.

''మల్లెపూల పొట్లాం. పరాత్పరరావు ఆఖరి కోరిక. నీకు మల్లెపూలు ఇవ్వమని ఉత్తరంలో రాశాడు. స్నేహితుడి కోరికను తీరుస్తున్నాను'' అన్నాడు శివపాదం నవ్వుతూనే.

''నిజం చెప్పు'' అన్నది మంగళ అతనికి కొంచెం దూరంగా జరుగుతూ-

''కావాలంటే నువ్వే చూడు'' అంటూ శివపాదం చేతిలో వున్న కత్తిని విసురుగా పైకి లేపాడు.

అప్పుడు మసకగా వున్న ఆ వెలుతురులో ఆ కత్తి అంచు మెరిసింది.

సరిగ్గా అప్పుడే ఆ గదిలో ట్యూబులైటు వెలిగింది. తలుపు పక్కనే వున్న బీరువా చాటు నుంచి బయటకు వచ్చిన మనిషి శివపాదం చేతిని పట్టుకొని వెనక్కు విరిచాడు. చేతిలో కత్తి జారి పడింది.

''ఎవరున్నువ్వు?'' ఆశ్చర్యపడి అడిగాడు శివపాదం. ఆ గదిలో ఓ మగాడిని అతడు ఊహించలేదు.

''ఈ ఏరియా పోలీసు ఇన్‌స్పెక్టరుని'' చెప్పాడు ఆ మనిషి శివపాదం చేతిని మెలి తిప్పుతూ-

***

తెల్లవారి ఉదయం పోలీసుస్టేషన్‌లో పరాత్పరరావు, మంగళ శివపాదాన్ని కలుసుకున్నారు.

హత్యాప్రయత్నం చేసినందుకు పోలీసులు శివపాదాన్ని కస్టడీలోకి తీసుకొని రిపోర్టు తయారుచేశారు.

వాళ్లిద్దర్నీ చూసి శివపాదం ఆశ్చర్యానికి లోనై ''ఇదెలా సాధ్యం?'' అని అడిగాడు.

''అంతా పథకం ప్రకారం జరిగింది'' అన్నాడు పరాత్పరరావు.

''అబద్ధం. పథకం ప్రకారం జరగలేదు'' అరిచాడు శివపాదం.

అప్పుడు పరాత్పరరావు నవ్వి ''ఆవేశపడకు. హత్యా పథకం ప్రకారం కాదు. హత్యకు ముందు పథకం ప్రకారం అంతా సవ్యంగా జరిగింది మిత్రమా'' అన్నాడు.

''ఆ పథకం ఏమిటి?'' అడిగాడు శివపాదం.

''కొంచెం ఫ్లాష్ వుంది. ఆ పథకంలో భాగంగానే నేను నీతో తొలిసారిగా 'శుభసంకల్ప' బార్‌లో పరిచయం చేసుకున్నాను. స్నేహం నటించి రూమ్మేటునయ్యాను. మంగళ ఎవరో కాదు. నాకు బంధువుల అమ్మాయి. ఇదంతా ఎందుకు చేశానంటే- నువ్వు ఇక్కడకు రాక ముందు రాజమండ్రిలో వున్నప్పుడు మహితకుమారి అనే అమ్మాయిని ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశావు. అ అమ్మాయి నీ గురించి పూర్తి వివరాలు చెప్పి ఆత్మహత్య చేసుకుంది.మహహితకుమారి నాకు వరుసకు చెల్లెలు అవుతుంది. అప్పుడు నిన్ను వెతుక్కుంటూ ఇక్కడకు వచ్చాను. అప్పటికే మంగళ ఇక్కడ జాబ్ చేస్తోంది. మేమిద్దరం కలిసి నిన్ను జైల్లో పెట్టించడానికి పథకం రూపొందించాము. ఆ పథకానికి నువ్వు బలయిపోయావు. మగవాడు ఆడదానికి చేసిన అన్యాయం వెంటాడుతూనే వుంటుంది. ఇప్పుడు చెప్పు కామ్రేడ్...పథకం ప్రకారమే జరిగిందని ఒప్పుకుంటావా?'' అని అడిగాడు పరాత్పరరావు.

శివపాదం మాట్లాడలేదు. దిక్కుతోచక దిక్కులు చూస్తూ వుండిపోయాడు కానీ మంగళ మాత్రం శబ్దం అయ్యేలా నవ్వింది గతాన్ని తల్చుకుని.

★